క్లుప్తంగా

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

పెద్దదోర్నాల: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మేజర్ పంచాయతీలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు ఏబీఎం ట్రస్ట్ మిషన్ ఆధ్వర్యంలో తెలుగు బాప్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడు జినుకూటి జాన్‌బాబు దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ చిత్తూరి హారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, యక్కంటి మల్లారెడ్డి, నాగరాజు, పంచాయితీ కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు.

రైతులకు ఘన సన్మానం



తాళ్లూరులో రైతులను సన్మానిస్తున్న ఏఓ

తాళ్లూరు (ముండ్లమూరు): జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా శనివారం రైతులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. అనంతరం సాగులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పీపీఎల్ కంపెనీ జోనల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భగవద్గీత సారాంశాన్ని గుర్తించాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ భగవద్గీత సారాంశాన్ని గుర్తించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వక్తలు పి.హనుమంతారెడ్డి, మునుగొండ్ల వంశీకృష్ణ అన్నారు. గీతా జయంతి సందర్భంగా పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన విధానంలో ఎలా జీవించలో తెలియజేశారు. గీతలోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాటిని అనుసరించే విధంగా జీవించాలన్నారు. నిత్యజీవన శైలి వ్యవహారంలో భక్తులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి, గిద్దలూరు దేవాలయాల నిర్వాహకులు చేరెడ్డి యర్రారెడ్డి, ఎస్ఆర్ఐ బీఎస్ రెడ్డి పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన ఉండాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన ఉండాలని గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాదానమ్మ అన్నారు. పట్టణంలోని సబ్ జైలులో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవిస్తున్న మీరు మీ కుటుంబ సభ్యుల గురించి ఒక్కసారి ఆలోచిస్తే వారి బాధ అర్థమవుతుందన్నారు. శిక్ష పూర్తి అయిన తర్వాత అయినా చట్టానికి అనుగుణంగా జీవించాలని ఆకాంక్షించారు. జైలులో వసతులు, ఆహార ఏర్పాట్లు వంటి వాటి గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాదులు పిచ్చయ్య, రాజ్‌కుమార్, నాయక్, పారా లీగల్ వలంటీర్ మధు పాల్గొన్నారు.

యువకుల్లో శారీరక పుష్టి పెంపొందించాలి

గిద్దలూరు రూరల్: యువకుల్లో శారీరక పుష్టి పెంపొందించేందుకు వ్యాయామం తప్పనిసరిగా చేయించాలని ఎస్ఆర్ఐ బీఎస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో శనివారం విద్యార్థులకు త్రీకే రన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరక దృఢత్వం కలిగి ఉండటంతో మానసికంగా బలంగా ఉండగలుగుతారన్నారు. నిత్య జీవితంలో శారీరక శ్రమ ఎంతగానో అవసరమన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి విద్యార్థి వారి దిన చర్యలో భాగంగా వ్యాయామాన్ని తప్పకుండా చేయాలన్నారు. సాయిచైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి, గిద్దలూరు దేవాలయాల నిర్వాహకులు చేరెడ్డి యర్రారెడ్డి పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



బేస్తవారిపేట: క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన షటిల్ డబుల్స్ పోటీలను ఎస్‌ఐ నరసింహారావు శనివారం ప్రారంభించారు. ఆటల పోటీలతో స్నేహభావం, పోటీతత్వం పెరుగుతుందని, ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు జరుపుకోవాలని ఎస్‌ఐ కోరారు. మాజీ జెడ్పీటీసీ తాతపూడి ఐజయ్య, ఎమ్మార్పీస్ నియోజకవర్గ కన్వీనర్ బూదాల ఆనంద్, మండల అధ్యక్షుడు వేశపోగు భరణి, ది సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గ సభ్యులు సీహెచ్ జోసఫ్, కె.సామ్యేల్, సీహెచ్ విక్టర్, శ్యామ్, ఆనంద్ పాల్గొన్నారు.

విషాదం.. విషణ్ణవదనం

- ఘోర రోడ్డు ప్రమాదంలో విగతజీవులుగా బాధితులు
- అభినయ్, రత్నతేజ తల్లిదండ్రుల గుండెకోత
- రోదిస్తున్న డ్రైవర్ అబ్దుల్ హుస్సేన్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డానియేల్ కుటుంబ సభ్యులు

త్రిపురాంతకం: మండల పరిధిలోని దేవరాజుగట్టు వద్ద శుక్రవారం కారు– ఆటో ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో మండలానికి చెందిన అన్నదమ్ములిద్దరూ క్రిస్మస్ పండుగకు దుస్తులు కొనుగోలు చేసేందుకు మార్కాపురం బయలు దేరి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వీరి మృతదేహాలను స్వగ్రామం దూపాడు తీసుకు రాగా ఆ ప్రాంతమంతా బంధువుల రోదనలతో మారుమోగింది. దూపాడు గ్రామానికి చెందిన అభినయ్ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, సోదరుడు రత్నతేజను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి వరకు తమ ముందు ఆటలాడుతూ కనిపించిన చిన్నారులు ఇకలేరని తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎనిబెర పెద్ద లాజరు, ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు. అభినయ్ రాజంపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో 6వ తరగతి చదువుతుండగా, తమ్ముడు రత్నతేజ మార్కాపురం ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. క్రిస్మస్ పండగను ఆనందంగా జరుపుకునేందుకు స్వగృహం వద్ద అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పిల్లలకు దుస్తులు కొనుగోలు కోసం రావాల్సిందిగా చెప్పిన లాజరు ముందుగా మార్కాపురం వెళ్లాడు. అయితే పిల్లలు ఇద్దరూ కుంట వరకు వచ్చి మరో ఆటోలో మార్కాపురం బయలుదేరి ప్రమాదానికి గురయ్యారు. అప్పటికే అభినయ్ మృతి చెందాడని, రత్నతేజ తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉండి అన్న కోసం ఆరాటపడటం చూసి వారు భోరున విలపించారు. హుటాహుటిన వైద్యశాలకు తరలించినా ఫలితం దక్కలేదు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ నాసర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎనిబెర శైలజ వారి వెన్నంటే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తహసీల్దార్ వి. కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓలు కె. తులసిమల్లికార్జున నాయక్, టి. రాజశేఖరరెడ్డి ఉన్నారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డితో మాట్లాడి శవ పంచనామా పూర్తి చేయించారు. సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ చూపారు.

నా గుండెను తీసి పిల్లలకు పెట్టండయ్యా..



అభినయ్ (ఫైల్)



రత్నతేజ (ఫైల్)



రోదిస్తున్న అభినయ్, రత్నతేజల తల్లి ఉమ



మృతులు అభినయ్, రత్నతేజ ఇంటి వద్ద గుమిగూడిన జనం

మార్కాపురం: 'నాకు నా ఇద్దరు పిల్లలు కావాలి... వారు లేనిదే నేను ఉండలేను. వారిని బతికించేందుకు నా గుండెను తీసి పెట్టండయ్యా' అంటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అభినయ్, రత్నతేజ తల్లి ఉమ రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. 'నా పిల్లలకు టిఫిన్ పెట్టనిదే నేను తినను. వారితోనే నా జీవితం' అంటూ పోస్టుమార్టం రూంలో విగత జీవులుగా పడి ఉన్న కుమారులను చూసి తండ్రి లాజరుతోపాటు తల్లి ఉమ తల్లడిల్లిపోయింది. 'వారికోసమే మేమిద్దరం బతుకుతున్నాం. స్కూల్ నుంచి వస్తే ఇంటిలో నా వెంటే తిరుగుతారు. ఏ మాత్రం గోలచేయరు. చెప్పిన మాట వింటారు. నేనెవరికోసం బతకాలయ్యా' అంటూ దుఃఖిస్తున్న కన్నవారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. శనివారం ఉదయం మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో వైద్యశాల మిన్నంటింది.

4 నెలల క్రితమే కువైట్ నుంచి..



మృతి చెందిన డ్రైవర్ బాబు (ఫైల్)



డ్రైవర్ బాబు కుటుంబ సభ్యులు

ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ అలియాస్ బాబుది మార్కాపురం. నాలుగు నెలల క్రితమే దుబాయ్ నుంచి వచ్చి ఆటో బాడుగకు తీసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య రమీజాబీ, కూతుర్లు ఆరీఫా, రబియా ఉన్నారు. శుక్రవారం కూడా యథావిధిగా ఆటో తీసుకుని సాయంత్రం కల్లా వస్తానని కూతుర్లతో చెప్పి వెళ్లిన బాబు తిరిగిరాని లోకాలకు వెళ్లాడని పిల్లలిద్దరూ తండ్రి మృతదేహం చూసి విలపించారు. ఇక మా కుటుంబానికి దిక్కెవరంటూ రోదించారు. ఇలా మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో వైద్యశాలంతా విషాదకర వాతావరణం నెలకొంది.



దూపాడులో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ఆదుకుంటాం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఇది హృదయ విదారక సంఘటన అని తెలిపారు. మృతుల కుటుంబాలను త్వరలోనే తాను కలిసి పరామర్శిస్తానని, వారికి అండగా ఉంటామని ఆయన తెలిపారు. దేవుడు ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానంటూ సంతాపం ప్రకటించారు.

గృహ ప్రవేశానికి హాజరై తిరిగి వెళ్తుండగా..

కొమరోలు: తమ దాయాది గృహ ప్రవేశానికి హాజరై వేడుకల్లో ఆనందంగా గడిపిన కుటుంబం రహదారి ప్రమాద రూపంలో రెండు నిండు ప్రాణాలను బలికొంది. కొమరోలు మండలం వర్ధనపల్లి గ్రామానికి చెందిన రాయి వెంకటేశ్వర్లు (62), రాయి నాగేశ్వరరావు (55) 40 సంవత్సరాల క్రితం గుంటూరులో వ్యాపారం చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. శుక్రవారం దాయాది రాయి చిన్న వెంకటేశ్వర్లు గృహ ప్రవేశం జరిగిన నేపథ్యంలో తన సోదరులను ఆహ్వానించాడు. ఈనేపథ్యంలో కొమరోలులో గృహ ప్రవేశానికి శుక్రవారం ఉదయం వీరిరువురు హాజరయ్యారు. మధ్యాహ్నం వరకు బంధుమిత్రులతో సరదాగా, ఆనందంగా గడిపిన ఇరు కుటుంబాలు భోజనం చేసిన అనంతరం గుంటూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామం వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు, ఆటో ఎదురుగా ఢీకొనడంతో ఇరువురు సోదరులు అక్కడికక్కడే మృతి చెందారు. రాయి నాగేశ్వరరావు కుమారుడు నారాయణ 3 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. రహదారి ప్రమాదంలో ఇరువురు మృత్యువాత పడటంతో వర్ధనపల్లె గ్రామంలో కొమరోలులో విషాద ఛాయలు అలముకున్నాయి.

విగతజీవిగా మారిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిన ఉప్పలపాటి డానియేల్ స్వగ్రామం పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆటోలో వస్తూ తీవ్ర గాయాలు కాగా జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడటంతో భార్య మోహన కుప్పకూలిపోయింది, కుమారుడు రెండేళ్ల డానియేల్ పరిస్థితి ఏమిటంటూ కుమిలిపోయింది. తీవ్రంగా గాయపడిన అగ్రికల్చర్ విద్యార్థినులు మైథిలి, ముషీదా, కమ్రాన్‌లు కర్నూల్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన ఆర్జేడీ సుబ్బారావు, విద్యాశాఖాధికారులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన విద్యాశాఖాధికారులు

మార్కాపురం టౌన్: విద్యార్థులు చదువుతోపాటు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను చేస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, గుంటూరు విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు అన్నారు. శనివారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. జిల్లా స్థాయికి 190 ఆవిష్కరణలు వచ్చాయని వీటిలో వ్యక్తిగత, గ్రూపు క్యాటగిరితోపాటు 38 టీచర్ క్యాటగిరీలు వచ్చాయన్నారు. ముందుగా టెట్రా సైక్లెన్ కనుగొన్న తెలుగు శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, డీఎల్‌డీఓ సాయికుమార్, డిప్యూటీ డీఈఓలు చంద్రమౌళీశ్వర్, అనీతారోజ్ రాణి, ఎంపీడీఓ చందన, జాతీయ ఉత్తమ సైన్స్ అవార్డు గ్రహీత జగన్నాథ్, ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి

మార్కాపురం: వచ్చే ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు డీఈఓ సుబ్బారావు తెలిపారు. శనివారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. 38 మండలాల్లో 29,466 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ప్రత్యేక స్టడీ అవర్స్‌తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ ఫెయిర్ విజేతలు

మార్కాపురం టౌన్: వ్యక్తిగత క్యాటగిరీలో మొదటి బహుమతిని జి. శివకౌశిక్, డి. సాత్విక్, సీహెచ్ దేవరాజు, రెండో బహుమతిని జీవీ అభిరామ్, బి. లక్ష్మీ ప్రియ, కె. గౌతమి, మూడో బహుమతిని సీహెచ్ వసంతకుమార్, డి. నివాస్, కె. నితీష్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. గ్రూపు క్యాటగిరీలో మొదటి బహుమతి ఎస్‌కే జమీర్, మణికంఠ, వెంకట్, నరసింహ, కె. శ్రావణి, ఇ. శ్రీజ, ద్వితీయ బహుమతిని డి. ధనలక్ష్మి, హారిక, ఎస్ నిఖిల్, కె. శ్రీనివాసులు, టి. వీరబ్రహ్మం, తృతీయ బహుమతిని ఎం. అంజలి గెలుపొందారు.

టీచర్స్ క్యాటగిరీలో..

ప్రథమ బహుమతి ఎం. లక్ష్మీ కాంతమ్మ, పి. ప్రమీల , కె. రాము, ద్వితీయ బహుమతిని కె. పద్మజ, కె. స్వర్ణలత, ఎస్.కె సికిందర్ బాషా, తృతీయ బహుమతిని జి. రాజగోపాల్, ఏ. ఉమా మహేశ్వరి, జి. ప్రభాకర్ విజేతలుగా నిలిచారు. సైన్స్‌ఫెయిర్‌కు హాజరైన విద్యార్థులకు పార్టిసిపేషన్ బహుమతులను అందించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ఆర్జేడీ సుబ్బారావు, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరి 6లోపు దరఖాస్తు చేయాలి

ఒంగోలు టౌన్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీం కింద స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని తెలిపారు. నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డు పొందిన జర్నలిస్టుల వివరాలు, వృత్తి అనుభవాన్ని విజయవాడలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం పరిశీలించిన అనంతరం ప్రాథమికంగా ధ్రువీకరించామన్నారు. ఇప్పటి వరకు 136 మంది అర్హులైన జర్నలిస్టుల వివరాలను జిల్లాకు పంపించినట్లు వివరించారు. తదుపరి దశలో వీటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా వ్యవహరించే కమిటీ పరిశీలించి అవసరమైన వెరిఫికేషన్ అనంతరం అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుల నియామకం

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షులను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. కంభం మండలానికి అవ్వారి గురుమూర్తి, బేస్తవారిపేట మండలానికి దప్పిలి వెంకట రామిరెడ్డి, గిద్దలూరు (ఎస్‌పీ) జీఎల్ రమణకుమార్, గిద్దలూరుకు ఈ.పాండురంగారెడ్డి, కొమరోలుకు లకుమారపు జనార్దన్, రాచర్ల మండలానికి బొమ్మని మల్లికార్జునరెడ్డిలను నియమించారు.

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యువజన విభాగం మండల అధ్యక్షులను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. యర్రగొండపాలెం మండల అధ్యక్షుడిగా కందుల నాగార్జునరెడ్డి, పుల్లలచెరువు మండల అధ్యక్షుడిగా పంది నాగేశ్వరరావు, త్రిపురాంతకం మండల అధ్యక్షుడిగా తాడికొండ కోటి, పెద్దారవీడు మండల అధ్యక్షుడిగా దుగ్గెం దినేష్, పెద్దదోర్నాల మండల అధ్యక్షుడిగా గొలమారి రాజశేఖరరెడ్డి నియమితులయ్యారు.

మార్కాపురం: వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజక వర్గ యువజన విభాగం పార్టీ అధ్యక్షుల నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మార్కాపురం పట్టణ యువజన విభాగ అధ్యక్షులుగా బొమ్మిరెడ్డి క్రిష్టా రెడ్డి, మార్కాపురం మండల అధ్యక్షులుగా పువ్వాడ శ్రీనివాసులు, తర్లుపాడు అధ్యక్షులుగా మేకల వెంకట రెడ్డి, పొదిలి మండల అధ్యక్షునిగా జి. గిరిబాబు రెడ్డి, పొదిలి పట్టణ అధ్యక్షునిగా మోరా అంజిరెడ్డిని నియమించారు.

విద్యుదీకరణ పనులు ప్రారంభం



విద్యుదీకరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ, పక్కన నాయకులు

మార్కాపురం: పట్టణ శివార్లలోని పూలసుబ్బయ్య కాలనీ పరిధిలోని 15వార్డులో ఉండే ఎస్‌టీ కాలనీలో గత 30 ఏళ్ల నుంచి విద్యుత్ సౌకర్యం లేక తాము పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరిష్కరించారు. కలెక్టర్ దినేష్‌కుమార్‌తో మాట్లాడి 40 లక్షల రూపాయలతో కాలనీలో మొత్తం 18 స్తంభాలు, వైరింగ్, వీధిలైట్లను ఏర్పాటు చేశారు. వీటిని శనివారం రాత్రి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్‌తో కలిసి స్విచ్ వేసి విద్యుత్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేకు కాలనీవాసులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. డీఈ సుభానీ, ఎలక్ట్రికల్ ఏడీ షియానాయక్, ఏఈ ఆదినారాయణ, సచివాలయ కన్వీనర్లు సుష్మిత, భాషా, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఉస్మాన్, షెక్షావలి, మాజీ కౌన్సిలర్ పెద్దన్న, కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగవద్గీత గళార్చన



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ, నిత్యముక్త ప్రభు

మార్కాపురం టౌన్: గీతా జయంతి సందర్భంగా శనివారం రాత్రి పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో భగవద్గీత సహస్ర గళార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి తిరుపతి ఇస్కాన్ మందిరం ఆధ్యాత్మికవేత్త నిత్య ముక్త ప్రభువు తదితరులు మాట్లాడారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి గుడి నుంచి మహిళా భక్త బృందం కోలాటాలు, సాంస్కృతిక కార్యకలాపాలతో నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, సనాతన హిందూ ధర్మపరిషత్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులైన గోపాలుని హరిహరరావు, వీరారావు, డి. చంద్రశేఖర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు వనజాక్షి, ఊటుకూరి రామకృష్ణ, గుంటక సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైన్స్‌ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక

కురిచేడు: సైన్స్‌ఫెయిర్ జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ దేవ రాజ్ ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఆర్ సాయి తెలిపారు. మండలస్థాయిలో వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచి మార్కాపురంలో శనివారం జరిగిన పోటీల్లో జిల్లాస్థాయికి వెళ్లాడు. అక్కడ విజేతగా నిలిచి తన ప్రాజెక్టు టిల్సా కాయిల్‌ను రాష్ట్రస్థాయిలో ప్రదర్శించేందుకు వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేవరాజ్‌ను, గైడ్ చేసిన ఉపాధ్యాయుడు ఉదయభాస్కర్‌ను ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఆర్ సాయి, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుభాషిణిలు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

సాక్షి నెట్‌వర్క్: వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను మార్కాపురం, గిద్దలూరు, వై.పాలెం, దర్శి నియోజకవర్గాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


గిద్దలూరు: గరుడ వాహనంపై స్వామి వారు


తాళ్లూరులో దేవతా మూర్తులను ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


వెలిగొండలో ఉత్తరద్వార దర్శనమిస్తున్న స్వామి వారు, అమ్మవార్లు


దర్శి: రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం


బేస్తవారిపేటలో..


తర్లుపాడులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


యర్రగొండపాలెంలో..


త్రిపురాంతకం: పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

గిద్దలూరు విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు రూరల్: యర్రగొండపాలెం ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన ఆటల పోటీల్లో గిద్దలూరుకు చెందిన గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో జోనల్ స్థాయిలో వి.నాగేంద్రటీమ్ ప్రథమ స్థానంలో, కబడ్డీలో ప్రేమరాజు టీమ్, జావ్‌లింగ్ త్రో, షెటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో వి.నాగేంద్రుడు, చదరంగంలో జి.నాగార్జున, 800 మీటర్ల పరుగు పందెంలో డి.హనుమానాయక్, 100 మీటర్లు పరుగు పందెంలో వి.నాగేంద్రుడు, 200 మీటర్లు పరుగు పందెం, డిస్కస్ త్రో క్రీడల్లో ఆర్.మంత్రునాయక్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.


గెలుపొందిన విద్యార్థులతో వెంకటేశ్వరనాయక్

జూనియర్ ఎన్‌సీసీ యూనిట్ మంజూరు

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ బెటాలియన్ దొనకొండ జెడ్పీకి జూనియర్ ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు కె.నరసింహారావు తెలిపారు. శనివారం సుబేదార్ నిర్బల్ సింగ్ బృందం దొనకొండకు విచ్చేసి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నమోదు చేసుకుంది. 8, 9వ తరగతి బాలబాలికలను 30:70 రేషియోలో ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా అన్ని విభాగాల్లో విద్యార్థులను పరిక్షించి 20 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేసినట్లు నరసింహారావు తెలిపారు. ఎన్‌సీసీతో విద్యార్థులకు చాలా ఉపయోగం ఉంటుందని, ఉద్యోగాల్లో, చదువుల్లో ప్రత్యేకమైన రిజర్వేషన్ కోటా ఉంటుందని, పోలీస్, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, సెక్యూరిటీ వంటి ఉద్యోగాలు సాధించేందుకు ఎన్‌సీసీ ఎంతో ఉపయోగ పడుతుందని విద్యార్థులకు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో సుబేదార్ నిర్బల్ సింగ్

ఆడుదాం ఆంధ్రా క్రీడ సంబరాల్లో ఒన్‌కే రన్

గిద్దలూరు రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా ఒన్‌కే రన్ కార్యక్రమాన్ని శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి ఆదర్శ బీఈడీ కళాశాల వరకు ఒన్ కే రన్ నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వం పెంపొందించుకునేలా ఉండాలన్నారు. శారీర దృఢత్వంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. మానసిక ఒత్తిళ్లను తగ్గించుకుని రోగనిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు వ్యాయామాలు దోహదపడతాయన్నారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, నగర పంచాయతీ సిబ్బంది వలి, సాయికుమార్, ఆశీస్‌కుమార్, సచివాలయం కన్వీనర్ ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.


రన్ ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ

కణతిని వేటాడిన ఇద్దరు అరెస్టు

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట అటవీ ప్రాంతంలో కణతిని నాటు తుపాకీతో వేటాడి చంపిన ఇద్దరు గుండ్లకమ్మ రేంజి ఆఫీసర్ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ రేంజి ఆఫీసర్ వంశీకృష్ణ శనివారం అరెస్టు చేశారు. దిగువమెట్ట గ్రామానికి చెందిన మీనగ యశ్వంత్, గండు లక్ష్మిలు ఇద్దరు శుక్రవారం రాత్రి బైక్‌పై కణతి మాసం తీసుకెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కణతిని అభయారణ్యంలోని బెల్లం పాక ప్రాంతంలో వేటాడి చంపిన ప్రదేశం వద్దకు తీసుకెళ్లారు. కణతిని చంపిన కేసులో మొత్తం ఐదుగురు ఉండగా అందులో ఇద్దరు అటవీశాఖ అధికారులకు చిక్కారు. మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కణతిని చంపిన కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు రేంజి ఆఫీసర్ తెలిపారు. వారి నుంచి బైక్‌ను, తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


కణతిని చంపిన వేటగాడితో అటవీ శాఖ అధికారులు

26న మెగాజాబ్ మేళా

దర్శి: ఈ నెల 26వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ యువకులు అర్హులని చెప్పారు.వివరాలకు 99888 53335, 91005 66581, 70139 50097 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

దర్శి: ఇద్దరు పేకాట రాయుళ్లను సెబ్ సీఐ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ శనివారం తెలిపారు. వారి నుంచి రూ.8500 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులను దర్శి కోర్టుకు హాజరు పరుస్తామని చెప్పారు.